క్లుప్తంగా

దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలి



డిచ్‌పల్లి: భూభారతి సదస్సుల్లో రైతుల నుంచి భూ సమస్యలపై స్వీకరించిన దరఖాస్తుల ఎంక్వైరీ ప్రక్రియను ప్రభుత్వం నిర్ణయించిన నిర్దీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. మంగళవారం డిచ్‌పల్లి తహసీల్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. తహసీల్దార్ సతీశ్‌రెడ్డిని దరఖాస్తుల ఎంక్వైరీ ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లో ప్రస్తుతం ఎంక్వైరీ కొనసాగుతుందని 15లోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్‌ఐ సంతోష్ ఉన్నారు.

పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి



నిజామాబాద్ రూరల్: బీఎస్పీ బలోపేతం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరడి లక్ష్మణ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోపాల్, ఇందల్వాయి, నిజామాబాద్ రూరల్‌లో పార్టీని బలోపేతం చేయడానికి సెక్టార్, బూత్ కమిటీలను వేసి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతె ప్రవీణ్, సంపత్, అనిల్, ప్రసాద్, హర్ష, లక్ష్మణ్, ప్రభుదాస్, ఎడ్ల రాములు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



నిజామాబాద్ రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈవో సేవులా అన్నారు. మంగళవారం మండలంలోని గూపన్‌పల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు నాణ్యమైన భోజనంతో పాటు రోజు మెనూ ప్రకారం భోజనం అందంచాలని సూచించారు. అనంతరం ఎంఈవో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠ్యాంశాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూనిఫామ్స్ అందజేత



నిజామాబాద్‌నాగారం: నగరంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ప్రధాన కార్యాలయంలో మంగళవారం పలు పాఠశాలల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు యూనిఫామ్‌లను డీఈవో అశోక్ అందజేశారు. యూనిఫామ్ దాత ఏటీఎస్ కంప్యూటర్స్ శ్రీనివాస్ ఆర్థికసాయంతో జిల్లాలోని 34 పాఠశాలల విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి డి వెంకటరమణ, సభ్యులు రాజులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఓ జూనియర్ కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు శశిధర్, రఘురాం, అనిల్, విఘ్నేశ్, దీపిక, కుషాల్, రాజు, తిరుపతి, కళ్యాణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	36	70	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	50	90
జీరకాయ	40	80	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	100	150	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	80	గోబిపువ్వు	30	60
వంకాయ	30	60	బీట్‌రూట్	30	60
పాలకూర	30	60	కరివేపాకు	40	80
మెంతికూర	30	60	చామగడ్డ	30	60
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	40	80
పుదీనా	50	90	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్

గుంతల మయం.. గుర్బాబాది రోడ్డు

- వర్షాలకు నీరు నిలుస్తున్న పరిస్థితి
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



శివాజీ చౌక్ వద్ద వర్షంతో నిండిన గుంత

ఖలీల్‌వాడి: నగరంలోని గుర్బాబాది రోడ్డు గుంతల మయంగా మారింది. ఈ రోడ్డు గుండానే కిసాన్‌గంజ్(కొత్త గంజ్), నిజామాబాద్ సమీకృత కలెక్టరేట్, జీజీ కాలేజీలు ఉండడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. అంతేకాకుండా గంజ్‌కు జిల్లాతో పాటు నిర్మల్, జగిత్యాల, కామారెడ్డి జిల్లా, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి రైతులు పంటలను అమ్మకాల కోసం తీసుకొస్తుంటారు. దీంతో ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ కుడా ఎక్కువగా ఉంటుంది. ఈ రోడ్డు గుండా పలు చోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురుస్తున్నందున గుంతల్లో నీరు చేరుతోంది. గుంతలు తెలియని వాహనదారులు వాటి గుండా ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా కిసాన్ గంజ్‌కు బైపాస్, అర్సపల్లి రోడ్డు ద్వారా వాహనాల రాకపోకలు కూడా ఎక్కువగా కొనసాగుతాయి. ఈ ప్రాంతంలో కూడా రోడ్లు గుంతలుగా ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి స్థానిక రైల్వే గేటు నుంచి గుర్బాబాది రోడ్డు వరకు ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



గుర్బాబాది రోడ్డు గుండా గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నా యి. మున్సిపల్ అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. వాహనాదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– కృష్ణారావు, కాలనీవాసి

ప్రమాదకరంగా గుంతలు

రోడ్డు గుండా ప్రమాదకర గుంతలు ఏర్పడ్డాయి. నగర పాలక సంస్థ అధికారులు దీనిపై దృష్టి సారించాలి. ఇక్కడి నుంచి కలెక్టరేట్, గంజ్, జీజీ కాలేజీకి చాలా మంది రాకపోకలు సాగిస్తారు. అధికారులు స్పందించాలి.

– నారాయణ, కాలనీవాసి

సేవా కార్యక్రమాలు అభినందనీయం



కలెక్టర్‌కు న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1.50లక్షల విలువైన టీబీ పేషెంట్లకు అవసరమైన 150 న్యూట్రిషన్ కిట్లను ఐడీవోసీలో కలెక్టర్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. టీబీ పేషెంట్లకు పోషకాహారంతో కూడిన ఈ కిట్లను అందజేస్తామని తెలిపారు. భవిష్యత్‌లోనూ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, డీఎం శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేషన్ సలహాదారులు నల్ల దినేశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ గుప్త, కోశాధికారి విజయ్‌కుమార్ స్వామి, ప్రతినిధులు వినోద్ గుప్తా, కర్క శ్రీకాంత్‌రెడ్డి, నర్సాగౌడ్, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలని



సిర్‌పూర్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న సుజాత సూర్యరాజ్



మాణిక్‌బండార్‌లో జెడ్పీహెచ్‌ఎస్‌లో..

మోపాల్: విద్యార్థులు చిన్ననాటి నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ సంస్కృతి(హైదరాబాద్) ప్రతినిధి జీఆర్ సుజాత సూర్యరాజ్ అన్నారు. మంగళవారం మోపాల్ మండలంలోని సిర్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా సుజాత సూర్యరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువులు నేర్చుకోవాలని, జీవితంలో అదే దారి చూపిస్తుందని అన్నారు. విద్యార్థుల కోసం గ్రంథాలయాన్ని తీర్చిదిద్దిన ప్రముఖ కవి, తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ కాసర్లను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, ఇందూరు యువత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, టీటీయూ జిల్లా అధ్యక్షుడు లాటికర్ రాము, ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, గాయత్రి, అక్బర్ బాషా, హజారే శ్రీనివాస్, లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నిజామాబాద్ సిటీ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని శానిటేషన్ ఎస్సై షాదుల్లా అహ్మద్ అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా మాణిక్ భండార్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు పచ్చదనం–పర్యావరణంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు మొక్కలు పంపిణీచేశారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు, తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జవాన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీలను బలిపీఠం ఎక్కించారు



మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ మహారాజ్

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి రెడ్డి, వెలమ, భూస్వాములు జేఏసీలుగా ఏర్పడి బీసీ, ఎస్సీ, ఎస్టీలను బలిపీఠం ఎక్కించారని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజ్ అన్నారు. మంగళవారం లహరి హోటల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీల ఆవిర్భావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీలను బలిపీఠం చేసి భూస్వాములు రెడ్డిలు, వెలమాలు తెలంగాణ రాష్ట్రాన్ని పాలిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన బీసీ, ఎస్సీ, ఎస్టీలను అణిచివేతకు గురయ్యారని అన్నారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యం కోసం జేఏసీ ఏర్పడిందన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవి మాట్లాడుతూ.. 42 శాతం బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పెట్టి పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ కుమారస్వామి, దాసోజు లలిత, వివిధ కులాల ప్రతినిధులు, జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్లు రాఘవేంద్ర, సుమన్, మహిపాల్ మంజుల యాదవ్, శ్రీనివాస్ గౌడ్, రాజేశ్వర్, బుస్సా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి



సిరికొండ: సమాజ సేవలో యువకులు ముందుండాలని ఎస్సై జాడి రామకృష్ణ అన్నారు. మండలంలోని తూంపల్లికి చెందిన హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఎస్సైని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. సంస్థ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను వారు ఎస్సైకి వివరించారు. సేవా కార్యక్రమాలు చేస్తున్న సభ్యులను ఎస్సై అభినందించారు. సంస్థ అధ్యక్షుడు శ్రీకాంత్, వైస్ చైర్మన్ రాజేందర్, వినోద్, ప్రశాంత్, బాలరాజు, మహేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కరం



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న అధికారులు

ధర్పల్లి: తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కరమని మెడికల్ ఆఫీసర్ శశాంత్ అన్నారు. ధర్పల్లి మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో మంగళవారం తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన పిల్లలకు ముర్రిపాలు తాగించాలని సూచించారు. పిల్లలకు తల్లిపాలు పట్టించకపోవడం వల్ల వారి ఎదుగుదలతో పాటు అనారోగ్యానికి గురవుతారని అన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బుజ్జి, సరిత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పడకల్‌లో మాట్లాడుతున్న అధికారులు

ఎల్లారెడ్డిపల్లెలో..

ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ప్రతీ ఏడాది ఆగస్టు మొదటి వారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి,అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌లో తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ఉన్నారు.

డెస్క్ బెంచీల వితరణ



సిరికొండ: మండలంలోని న్యావనంది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చిట్టాపూర్‌కు చెందిన వ్యాపారవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి ట్రస్ట్ ద్వారా డెస్క్ బెంచీలను వితరణ చేశారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గణేశ్, రాజ్‌కుమార్‌లు రూ. 75 వేల విలువ గల 20 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందచేశారు. అనంతరం పాఠశాల తరఫున వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రాములు, హెచ్‌ఎం రాజేశ్, మామిడికింది మహిపాల్, దయాసింగ్, సాగర్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత కలిగి ఉండాలి



నిజామాబాద్ నాగారం: విద్యార్థులు సేవా కార్యక్రమాలతో పాటు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని ఇందూరు యువత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో ఉన్న కార్యాలయంలో మంగళవారం పలు పాఠశాలల విద్యార్థులకు సేవా కార్యక్రమాలు– సామాజిక బాధ్యత అనే అంశంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుంటాం

ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యక్రమాల్లో ముందుంటుందని అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు పేర్కొన్నారు. సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సభ్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోశాధికారి జయదేవ్ వ్యాస్, ఉపాధ్యక్షులు సుజాత సుర్యరాజ్, గౌరవ సలహాదారులు పట్టేవార్ శ్రీనివాస్, సభ్యులు మద్ది గంగాధర్, ఎంపీ సుజాత రెడ్డి, ఐలేని సంతోష్ రెడ్డి, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేటర్లకు పనిభారం తగ్గించాలి



ఎస్‌ఈకి వినతిపత్రం అందజేస్తున్న నూర్జహాన్, సిబ్బంది

సుభాష్‌నగర్: డిచ్‌పల్లి డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్లలో పని చేస్తున్న ఆపరేటర్లు పనిభారంతో సతమతమవుతున్నారని, పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈమేరకు నగరంలోని విద్యుత్ ప్రగతిభవన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎస్‌ఈ రాపల్లి రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. డిచ్‌పల్లి డివిజన్‌లో ఉన్న సబ్‌స్టేషన్లలో ఇద్దరితోనే పనులు చేయిస్తున్నారని, పనిభారంతో ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా సిరికొండ, జక్రాన్‌పల్లి, గడ్కోల్, ధర్పల్లి సెక్షన్లలో అధిక పనిభారం ఉందన్నారు. ఆర్టిజన్లకు ఇచ్చిన స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం ఎక్కువ పనిదినాలు విధులు నిర్వర్తిస్తే ఓటీని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది నల్లూరి నరేశ్, మురళీ జాదవ్, రవి, పాకాల మహేశ్, ప్రభాకర్, నరేశ్, సంతోష్, మనోహర్, వేణు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తుకారం రాథోడ్

డిచ్‌పల్లి: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల సహకారంతో తగిన చర్యలు తీసుకోవాలని ఇందల్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి క్రిస్టినాను జిల్లా మలేరియా అధికారి తుకారం రాథోడ్ ఆదేశించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో మంగళవారం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి తుకారం హాజరై, మాట్లాడారు. గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ఇంటింటికీ తిరిగి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటిని తొలగించాలన్నారు. ఈగలు, దోమల వల్ల కలిగే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వంద ఇళ్ల చుట్టూ పరిసర ప్రాంతాలలో టిమోఫాస్ స్ప్రే చేయాలని సూచించారు. అనంతరం డిచ్‌పల్లి సీహెచ్‌సీ వైద్యురాలు అశ్విని మాట్లాడుతూ.. తల్లి పాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్, శిర్ప గోవర్ధన్, దేవపాల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది

ఉపాధ్యాయ సంఘాల ధర్నా



నిజామాబాద్ అర్బన్: ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ సుమన్ హాజరై మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, బిల్లులను వెంటనే చెల్లించాలని, పీఆర్సీని అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల హెల్త్ స్కీంను పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో కార్యదర్శి శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని గంగారాం, ఉపాధ్యక్షుడు శివకుమార్, జనరల్ సెక్రెటరీ జాఫర్ హుస్సేన్, విద్యాశాఖ ఫోరం జిల్లా అధ్యక్షుడు అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

నిజామాబాద్ సిటీ: నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం మున్సిపల్ ద్వారా ప్రతి రోజు సరఫరా చేసే తాగునీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు మున్సిపల్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి తాగునీటిని సరఫరా చేసే అలీసాగర్ నుంచి వచ్చే మంచినీటి పైప్‌లైన్‌కు అశోక్‌సాగర్ వద్ద మరమ్మతులు చేపడుతున్నందున నీటి సరఫరా ఉండదని అన్నారు. అర్సపల్లి, డైరీఫారమ్, మాలపల్లి, మిర్చి కాంపౌండ్, తిలక్ గార్డెన్ ఏరియా, ఖలీల్‌వాడీ, నాందేవ్‌వాడ, కంఠేశ్వర్, ఎల్లమ్మగుట్ట, చంద్రశేఖర్‌కాలనీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

ఆలయంలో పూజలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని కోటగల్లిలో ఉన్న భక్తమార్కండేయ మందిరంలో బుధవారం సామూహిక శివ అష్టోత్తర సహస్రనామ భస్మార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పద్మశాలి సంఘం పట్టణ సభ్యులు మంగళవారం తెలిపారు. సంఘ సభ్యులు, భక్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శాంతకుమారి

నిజామాబాద్ అర్బన్: ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి అన్నారు. నగరంలోని జీపీఎస్ కోటగల్లి శంకర్ భవన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరంతో బాధపడే వారు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలన్నారు. దోమల నుంచి జాగ్రత్తగా ఉండాలన్నారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామచందర్ గైక్వాడ్, ఉపాధ్యాయులు దయానంద్, ప్రసన్నలక్ష్మి, సవిత, మమత, నందిని, సౌందర్య, ముకుంద్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలకు కుర్చీలు అందజేత

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ కోసం ఎగ్జిబిషన్ సొసైటీ ప్రెసిడెంట్ బంటు రాజేశ్వర్, సభ్యులు 25 కుర్చీలను మంగళవారం అందజేశారు. తాము చదివిన కళాశాల అభివృద్ధికి సహకరించడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, కంప్యూటర్స్ శాఖ అధిపతి కిరణ్ కుమార్ గౌడ్, వివేకానంద, రాజేశ్, రాంకిషన్, ఉదయ భాస్కర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి నాలుగు రోజుల జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జడ్జి నాలుగు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఐదో టౌన్ పరిధిలో ఈ నెల 3న నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో ఖిల్లా ప్రాంతానికి చెందిన మారుతి పట్టుబడగా కేసు నమోదు చేశామన్నారు. అతన్ని కోర్టులో హాజరుపర్చగా విచారణ చేపట్టిన జడ్జి నాలుగు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై తెలిపారు. వాహనదారులు ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.